# పీపుల్స్‌వార్‌పైన నిషేధాన్ని వ్యతిరేకించమని ఎందుకు కోరుతున్నాం?

రాష్ట్ర ప్రభుత్వం జూలై నెలలో సిపిఐ (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్)పైన, ఆ పార్టీ అనుబంధ సంస్థలయిన విద్యార్థి, యువజన, కార్మిక, రైతుకూలీ, ఆదివాసీ సంఘాలపైన ప్రకటించిన నిషేధాన్ని వ్యతిరేకించమని, ఆ నిషేధాన్ని వెంటనే తొలగించవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయమని, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం మీకు విజ్ఞప్తి చేస్తూ ఉంది.

ఎందుకు?

మీకు పీపుల్స్‌వార్ పార్టీ అంటే రాజకీయంగా సానుభూతి ఉండవచ్చు. ఉండకపోవచ్చు. ఆ పార్టీ అనుసరించే పద్ధతులను మీరు ఆమోదించవచ్చు. ఆమోదించకపోవచ్చు. అయినా ఆ పార్టీపైన ప్రభుత్వం ప్రకటించిన నిషేధాన్ని తొలగించమని కోరవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాం.

ఎందుకు?

పీపుల్స్‌వార్‌పైన నిషేధాన్ని వ్యతిరేకించే వాళ్ళంతా హింసనూ, సాయుధ పోరాట రాజకీయాలనూ సమర్థించేవాళ్ళని ప్రభుత్వం అంటుంది. పీపుల్స్‌వార్ పార్టీ మద్దతుదారులని అంటుంది.

అది నిజం కాదు. మేము ఏ పార్టీనీ సమర్థించం. ఎవరి హింసనూ సమర్థించం. అయినా ఈ నిషేధం ఎత్తివేయమని కోరుతున్నాం. కోరమని మిమ్మల్ని కూడా కోరుతున్నాం.

ఎందుకు?

పీపుల్స్‌వార్ హింస చేస్తూ ఉంది కాబట్టి నిషేధిస్తున్నామని ప్రభుత్వం అనింది. అంటే అర్థం ఈ సంవత్సరం జూలై నెల దాకా మన రాష్ట్రంలో హింసమీద నిషేధం లేదా? హత్యలకూ, భౌతిక దాడులకూ, బస్సుల దహనాలకూ, బిల్డింగుల పేల్చివేతకూ చట్టం అనుమతి ఉండిందా?

లేదని మనకందరికీ తెలుసు. ప్రతి హింసాత్మక చర్యనూ చట్టం ఎప్పుడో నిషేధించింది. వేల సంఖ్యలో కేసులు నమోదయి వున్నాయి. మరి ఇప్పుడు కొత్తగా దేనిని నిషేధించినట్టు? నిషేధ చట్టం (ఆం.ప్ర.పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్) దేనిని నిషేధించింది? కేవలం ఆ పార్టీ చేపట్టే హింసాత్మక కార్యకలాపాలనా?

కాదు. ఆ పార్టీకి సంబంధించిన అన్ని కార్యకలాపాలనూ అది నిషేధించింది. కార్యకలాపాలతోనయినా సహకరించడం, సహాయం చేయడం, వాటిలో పాల్గొనడం నేరాలుగా ప్రకటించబడ్డాయి.

హింసాత్మక కార్యకలాపాలు ఎప్పుడో నిషేధించబడ్డాయి కాబట్టి ఇప్పుడు కొత్తగా నిషేధించింది శాంతియుత కార్యకలాపాలను మాత్రమే. ఆ పార్టీ, ఆ పార్టీ ప్రజా సంఘాలు చేపట్టే ధర్నాలు, ఊరేగింపులు, బహిరంగ సభలు, వాళ్ళు ప్రచురించే కరపత్రాలు, పుస్తకాలు, పోస్టర్లు, వాళ్ళు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు - యివీ యిప్పుడు కొత్తగా నిషేధించబడినవి.

జూలై నెలలో ముఖ్యమంత్రి ఆర్భాటంగా విలేఖరుల సమావేశం నిర్వహించి గంభీరంగా ప్రకటించిన నిషేధం వీటిపైన; హింసపైన కాదు - అది ఎప్పుడో నిషిద్ధం అయిపోయింది.

దీనిని ఆమోదిద్దామా?

హింసచేస్తే కేసు పెట్టి కోర్టులో విచారించి శిక్షించే బాధ్యత ప్రభుత్వానిది. ఆ బాధ్యతను మీరు కాదనరు. మేమూ కాదనము. ఎటొచ్చీ నేర విచారణ న్యాయ సమ్మతంగా, ప్రజాస్వామికంగా ఉండాలనీ, కోర్టు విచారణతో నిమిత్తం లేకుండా పోలీసులే మరణ దండన విధించే చట్టబాహ్యమైన హత్యాకాండకు ఒక నాగరిక దేశంలో తావు ఉండరాదనీ మేము అంటాం. మీరు ఒప్పుకుంటారని ఆశిస్తాం.

హింసచేస్తే న్యాయసమ్మతంగా విచారించి శిక్షించవచ్చు. కానీ వారి భావ ప్రకటనా స్వేచ్ఛను నిషేధించడం సబబా? వాళ్ళు కరపత్రాలు వేయకూడదనీ, పోస్టర్లు అంటించకూడదనీ, శాంతియుతంగా సమావేశాలు నిర్వహించకూడదనీ, తమ

రాజకీయాలు చెప్పుకునే పుస్తకాలూ, పత్రికలూ ప్రచురించకూడదనీ నిషేధించడం న్యాయమా? ఈ కార్యకలాపాలకు సహకరించడం, సహాయం చేయడం, వాటిలో పాల్గొనడం శిక్షార్హమైన నేరాలుగా ప్రకటించబడడం భావ్యమేనా? ఒక ప్రజాస్వామ్యంలో సమర్థనీయమేనా?

కడప జిల్లాలో వై.యస్. రాజశేఖరరెడ్డి హింస చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీని నిషేధించాలని, అనంతపురంలో పరిటాల రవి హింస చేస్తున్నాడని తెలుగుదేశం పార్టీని నిషేధించాలని ఎవరయినా అంటారా? అంటే అది న్యాయం అని ఎవరయినా ఒప్పుకుంటారా? 'వాళ్ళను జైలులో పెట్టండి. పార్టీని ఎందుకు నిషేధిస్తారు?' అనరా?

పీపుల్స్‌వార్‌పైన పెట్టిన నిషేధం వల్ల ఎవరు హక్కులు కోల్పోతారు? ఎవరు చట్టం దృష్టిలో నేరస్తులవుతారు? సాయుధ దళ సభ్యులా? కాదు. వాళ్ళు లైసెన్సు లేకుండా ఆయుధాలు చేతబూనినప్పుడే చట్టం దృష్టిలో నిషిద్ధులయిపోయారు. ఇప్పుడు కొత్తగా నేరస్తులయ్యేది నిరాయుధులయిన గ్రామీణ ప్రజలు. పీపుల్స్‌వార్ పార్టీ సామాజిక పునాదికి చెందినవారు. వీళ్ళు గ్రామీణ ప్రాంతాల్లోని భూమిలేని నిరుపేదలు, చిన్నరైతులు, దళితులు, ఆదివాసీలు, గని కార్మికులు. పీపుల్స్‌వార్ పార్టీ సాంఘిక పునాది ఈ వర్గాలలో ఉంది. ఇప్పుడు నిషేధం ఫలితంగా నిర్బంధానికి గురికాబోయేది ఈ వర్గాలకు చెందిన ప్రజలే. వాళ్ళు నమ్ముకున్న పార్టీతోను ఆ పార్టీ నెలకొల్పిన కార్మిక, యువజన, రైతుకూలీ సంఘాలతోను 'సంబంధాలు' కలిగి ఉన్నందుకు, 'సహకరించినందుకు' వాళ్ళను ఇకమీదట జైలులో పెట్టవచ్చును. ఆ సంబంధాలు, ఆ సహకారం పూర్తిగా శాంతియుతంగా ఉండవచ్చును. అన్నం పెట్టడం, చందాలు ఇవ్వడం, కరపత్రాలు పంచటం, పోస్టర్లు అంటించటం, వారి సలహా మేరకు గ్రామ సమస్యల పరిష్కారానికి ఒక కమిటీ నెలకొల్పి ఆందోళన చేపట్టడం ఇవన్నీ నేరాలవుతాయి. ఇవే నిషేధించబడ్డాయి. వీటిని నిషేధించడం కోసమే పీపుల్స్‌వార్‌పైన నిషేధం ప్రకటించడం జరిగింది.

హింసను నిషేధించడం కోసం కాదు. అది ఎప్పుడో నిషేధించబడింది.

1992-95 కాలంలో రెండున్నర సంవత్సరాలపాటు మనరాష్ట్రంలో పీపుల్స్‌వార్‌పైన నిషేధం ఉండింది. అప్పుడు వేల సంఖ్యలో అరెస్టయింది, జైలుకు పోయింది, పైన పేర్కొన్న వర్గాల ప్రజలే. హింస చేసినందుకు కాదు. తప్పో, ఒప్పో తాము నమ్ముకున్న రాజకీయాలకు శాంతియుతంగా సహకరించినందుకు.

ఇది అన్యాయం, అనాగరికం. ఈ మాట అనడానికి మీరు పీపుల్స్‌వార్ సానుభూతిపరులు కానవసరం లేదు. ప్రజాస్వామ్య ప్రేమికులయితే చాలు. ఏ హింసా చేయకున్నా కేవలం ఒక రాజకీయాన్ని నమ్మినందుకు, ఆ రాజకీయాలకు సహకరించినందుకు ఎవరినయినా జైలుపాలు చేయడం నియంతృత్వ రాజ్యం లక్షణం. ప్రజాస్వామ్య పాలన లక్షణం కాదు.

అందుకే ఈ నిషేధాన్ని వ్యతిరేకించమని మిమ్మల్ని కోరుతున్నాం. అది హింసను సమర్థించడం కాదు; ప్రజాస్వామ్యాన్ని సమర్థించడం. పీపుల్స్‌వార్ రాజకీయాలను ఆమోదించడం కాదు; అప్రజాస్వామిక పాలనకు ఆమోదం నిరాకరించడం.

మనదేశంలో అన్ని సామాజిక, ఆర్థిక రంగాలలోనూ సంక్షోభం పెరుగుతూ ఉంది. ఈ సంక్షోభానికి పరిష్కారం వెతకాలంటే ప్రజలకు రాజకీయ స్వేచ్ఛ అవసరం. ప్రజల రాజకీయ స్వేచ్ఛపైన అహేతుకమయిన నిషేధాలు పెట్టే అధికారం ప్రభుత్వానికి మనం కట్టబెడితే మనం భవిష్యత్తును రూపొందించుకునే స్వేచ్ఛను కోల్పోతాం. సమస్యలకు పరిష్కారం వెతికే స్వాతంత్ర్యాన్ని కోల్పోతాం. నిషేధానికి గురయిన పార్టీ పట్ల మనకు సానుభూతి లేదనో, సాయుధ పోరాట రాజకీయాలంటే సదభిప్రాయం లేదనో ప్రభుత్వానికి అహేతుకమైన అధికారాలు కట్టబెడితే, ఈ రోజు నిషేధించబడిన వాళ్ళే కాదు, అందరమూ నష్టపోతాం.

అందుకే పీపుల్స్‌వార్‌పైన నిషేధాన్ని తొలగించమనే మా డిమాండ్‌తో మీరు కూడా గొంతు కలుపుతారని ఆశిస్తాం.

15 ఆగస్ట్ 1996

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం

(ఏ.పి.సి.ఎల్.సి.)